క్లుప్తంగా

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు



ఈవీఎంలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

నందికొట్కూరు: నియోజకవర్గంలో ఎన్నిల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఎన్నికల అధికారిణి ఆర్. సుధారాణి సూచించారు. శనివారం పట్టణంలోని అల్వాల సత్రంలో ఈవీఎంలపై తహసీల్దార్లకు, ఎంపీడీలకు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్.ఎస్.టీ ఎంసీసీ, వీవీటీ, వీఎస్టీలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల కల్పన, వివిధ రకాల అనుమతుల జారీ, ఫిర్యాదుల పరిష్కారంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సరిహద్దు చెక్ పోస్టుల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని పోలీసులకు సూచించారు.

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: వీకెండ్ సందర్భంగా శనివారం మహానంది భక్తులతో కళకళలాడింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు స్థానిక రుద్రగుండం, చిన్న కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకనంది, గరుడనంది ఆలయాలను భక్తులు సందర్శించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సందడి కొనసాగింది.

ముగిసిన బండలాగుడు పోటీలు



పోటీల్లో పాల్గొన్న రైతులను సన్మానిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల తిరునాల సందర్భంగా నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు శనివారం ముగిసినట్లు గ్రామ సర్పంచ్ నవీన్ కుమార్, ఆల య ధర్మకర్త సాలె కిరణ్‌కుమార్ తెలిపారు. పోటీ ల్లో మొత్తం 9 జతల ఎద్దులు పాల్గొనగా వాటిలో గెలుపొందిన వృషభాల యజమానులకు నిర్వాహకులు వరుసగా రూ.70వేలు, రూ. 50వేలు, రూ.30 వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు ప్రోత్సాహక బహుమతులను అందించినట్లు తెలిపారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న రైతులను కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. గ్రామ కమిటీ సభ్యులు, రాజు, మహేష్, శేషన్న, పర్వతాలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



బరకలకాలనీలో అవగాహన కల్పిస్తున్న డీహెచ్‌ఓ డాక్టర్ కాంతారావు నాయక్

మహానంది: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని డిస్ట్రిక్ట్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాంతారావునాయక్ అన్నారు. బండిఆత్మకూరు మండలంలోని బరకలకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో లభించే ఆకు కూరలు, కాయగూరలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణకుమారి, ఏఎన్‌ఎం సావిత్రి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగోడు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని గైనకాలజిస్ట్ డాక్టర్ సింధుప్రియ, డాక్టర్ నాగరాజు సూచించారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పఖ్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూలు విడుదల

నందికొట్కూరు : నందికొట్కూరు బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి సత్యనారాయణ శనివారం ప్రకటించారు. ఈ నెల 25, 26వ తేదీల్లో మధ్యాహ్నం మూడు గంటల్లోపు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి స్థానాలకు నామినేషన్లు దాఖలు చేయాలని, 27 న నామినేషన్ల ఉపసంహరణ, 30న బార్ అసోసియేషన్ రూములో పోలింగ్ ఉంటుందన్నారు. అనంతరం కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని తెలిపారు.

జూపాడుబంగ్లా ఎస్‌ఐగా లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఎస్‌ఐ గా ఆదోని త్రీటౌన్ పోలీసుస్టేషన్ ఎస్‌ఐ లక్ష్మీనారాయణను నియమించినట్లు సమాచారం. రెండు మాసాల నుంచి జూపాడుబంగ్లా స్టేషన్‌కు ఎస్‌ఐ లేకపోవడంతో ఫిర్యాదుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై స్పందించిన జిల్లా ఎస్పీ ఆదోని త్రీటౌన్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

- వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా కో- ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి
- ఎన్ని హామీలు ఇచ్చినా టీడీపీని ప్రజలు నమ్మరు
- నంద్యాల సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న కర్నూలు ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే శిల్పా, మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

ఆత్మకూరు: రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని, టీడీపీ ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కర్నూలు ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకొని టీడీపీ అధికారంలోకి వచ్చిందని, రైతుల రుణమాఫీ, పొదుపు మహిళల రుణాలు, బ్యాంకుల బంగారు తాకట్టు రుణాల మాఫీ లాంటి ఎన్నో హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. అలాంటి టీడీపీకి 2019లో ప్రజలు బుద్ధి చెప్పి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99శాతం పూర్తి చేసి ప్రజల హృదయాలను చూరగొన్నారని, ప్రజలందరూ వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు 10లక్షలకు పైగా జనాలు రావడంతో అన్ని పార్టీలు కంగుతిన్నాయని, ఆదెబ్బతో ఏ పార్టీ కూడా వచ్చే ఎన్నికల్లో నామమాత్రంగా కూడా పోటీ ఇచ్చే పరిస్థితిలో కూడా లేదని చెప్పారు.

బీజేపీని దుర్భాషలాడి అదే పార్టీతో పొత్తులా?

బీజేపీని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దుర్భాషలాడి, అదే పార్టీతో పొత్తుపెట్టుకోవడం సరికాదని రామసుబ్బారెడ్డి అన్నారు. ముస్లిం మైనార్టీలకు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, వాటిని రద్దు చేస్తామని బీజేపీ ప్రకటించడం సిగ్గుచేటన్నారు. నంద్యాలలో ఈనెల 28న సిద్ధం సభను నంద్యాల ఎస్పీజీగ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామని, భారీగా తరలి రావాలని కోరారు. ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా శిల్పా చక్రపాణిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. శ్రీశైలం నియోజకవర్గ అబ్బర్వర్ హబీబుల్లా మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో అత్యధికంగా మైనార్టీలు ఉన్నారని, మైనార్టీల అభివృద్ధి చెందాలంటే సీఎం జగన్‌తోనే సాధ్యమవుతుందని చెప్పారు.

కలిసికట్టుగా పని చేస్తాం..

ఆత్మకూరు పట్టణంలో మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కలిసి కట్టుగా పని చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారిఫ్, కో ఆప్షన్ సభ్యులు రషీద్ తెలిపారు. చిన్న చిన్న విభేదాల వల్ల ఎమ్మెల్యేకు కొంత దూరం ఉన్నామని, తమ సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడంతో ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ హబీబుల్లాతో కలిసి తాము శ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డితో సమస్యలు చెప్పామన్నారు. సమస్యల పరిష్కారంపై ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. తాము ఇతర పార్టీలకు వెళ్తున్నట్లు వస్తున్న ప్రచారాలు నిజం కావని, వైఎస్సార్‌సీపీలో తామంతా కుటుంబ సభ్యులుగా కలిసి మెలిసి పని చేస్తామన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని గెలిపించేందుకు కృషి చేస్తామని వార్డు కౌన్సిలర్లు, చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు పార్వతి, విజయ చౌదరి, బోయపార్వతి, కుందూరు శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, కలీముల్లా, జయకృష్ణ, నాగరాజు, రాజగోపాల్, మోమిన్, మునీర్‌బాషా, రంగన్న, ప్రకాశరావు, కలీముల్లా, సుల్తాన్‌తో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

పగిడ్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుజన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులకు ఈనెల 28వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంగ్లిష్ మాధ్యమంలో పూర్తిగా ఉచిత విద్యా బోధనను అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదదోవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు, ప్రస్తుతం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తు గడువు మే 22వ తేదికి ముగుస్తుందని స్పష్టం చేశారు. దూర ప్రాంతాల విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం కలదని వెల్లడించారు. విద్యార్థులు http:// cse. ap. gov. in// వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి, జిరాక్స్ కాపీలను పాఠశాలలో అందజేయాలన్నారు.

వెలుగోడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీ చేరికలు





ఎమ్మెల్యే శిల్పాసమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన సిద్ధాపురం నాయకులు, వైఎస్సార్‌సీపీలో చేరిన సిద్ధపల్లె గ్రామస్తులు

ఆత్మకూరు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఆ గ్రామంలోని టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం సిద్ధాపురం గ్రామానికి చెందిన 50కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ తనను నమ్ముకొని వచ్చిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిద్ధాపురం నాయకులు, పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, కుందూరు శివారెడ్డి, నాగేశ్వర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పుల్లారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి..

నంద్యాల పట్టణంలో ఈనెల 28వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు, వెలుగోడు, మహానంది, బండిఆత్మకూరు మండలాల నుంచి లక్షమందికి పైగా కార్యకర్తలు, అభిమానులు నంద్యాలకు తరలి వెళ్లి సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు. అంతకు మునుపు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు వరాల మాలిక్, మగ్బుల్, మహబూబ్‌బాషా, మునీర్‌బాషా,కోట్ల నాగేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి, మాబు, బాషా, వెంకటేశ్వరరావు, విజయచౌదరి, విజయ్, పార్వతి, దర్గమ్మ, కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన సిద్ధపల్లె గ్రామస్తులు

ఆత్మకూరు: మండలంలోని సిద్ధపల్లె గ్రామస్తులు శనివారం రాత్రి టీడీపీని వీడి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ చేరారు. గ్రామానికి చెందిన దర్గయ్య, చిన్నస్వామి, లక్ష్మిరెడ్డి, సంజీవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, సుబ్బమ్మ, జగన్‌రెడ్డితో పాటు 80 కుటుంబాల సభ్యులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లారెడ్డి, , వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీధర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, చిన్నరమణారెడ్డి, చంద్రారెడ్డి, పార్థసారథిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, రమణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలి



మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28న నంద్యాలలో జరిగే సిద్ధం సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎన్ని కూటములు కలిసివచ్చినా వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శమని గుర్తు చేశారు. దళితులకు, బీసీలకు ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగనన్న అని చెప్పారు. ప్రతి ఇంటికి ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, నాయకులు శివరామకృష్ణారెడ్డి, తులసిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, షేక్ మహమ్మద్ గౌస్, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించి పనులు చేసుకోండి



హైవే నిర్మాణ పనులను అడ్డుకున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

పాములపాడు: మండల కేంద్రంలో జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను రైతులు శనివారం అడ్డుకున్నారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం జమ చేసి పనులు చేసుకోవాలని స్పష్టం చేశారు. పాములపాడు గ్రామంలోని సర్వే నెంబరు 62లో రవీంద్రకుమార్, లక్ష్మీదేవిలకు 4 ఎకరాల పొలం ఉంది. కాగా 1.33 ఎకరాలు రోడ్డులో పోనుంది. కాగా ఇందుకు గాను రూ.1.33 కోట్లు పరిహారం అందిస్తామని అధికారులు చెప్పినట్లు ఆ రైతు కుటుంబీకుడు రాజేష్ పేర్కొన్నారు. కాగా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా తమకు పరిహారం అందలేదని, రాత్రికి రాత్రి గుత్తేదారు తమ పొలంలో మట్టి తరలించారని, ఇదెక్కడి న్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మాలన్‌బీ, శ్రీనివాసరావు అనే రైతులదీ ఇదే పరిస్థితి. సర్వే నెంబరు 61లో 1.59 ఎకరాల వక్ఫ్ బోర్డుకు చెందిన పొలం కూడా పోనుంది. ఈ పొలాన్ని గతంలో కొనుగోలు చేశామని, పన్ను కూడా కడుతున్నామని, పరిహారం అందలేదని అర్జున్ అనే రైతు వాపోయాడు. వీరంతా పనులను అడ్డుకున్నారు. ఎన్‌హెచ్ సైట్ ఇంజినీర్ వైద్యనాథ్ రైతులతో మాట్లాడారు. పరిహారం విషయం తమకు సంబంధం లేదని, రోడ్డుకు కేటాయించిన పొలంలో పనులు చేయడం జరుగుతుందని చెప్పారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం ఈ పొలం విషయం కోర్టులో ఉన్నందున రైతులకు పరిహారం అందలేదని తెలుస్తోంది. కాగా వారం రోజుల్లో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని, రైతులకు పరిహారం అందేలా చూస్తామని చెప్పడంతో తాత్కాలికంగా పనులను నిలిపి వేశారు.

మల్లన్న సేవలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోత్స్న శర్మ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. న్యాయమూర్తి దంపతులు మల్లికార్జున స్వామివారికి అభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదతర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను అందించి సత్కరించారు. అలాగే స్వామి, అమ్మవార్లను మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎం.ఎస్.భండారి, తెలంగాణ, ఆంధ్ర ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుమిత దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

పరీక్షలకు 265 మంది హాజరు

కొత్తపల్లి: పదవ తరగతి పరీక్షల్లో భాగంగా ఐదవ రోజు ఫిజికల్ సైన్స్ పరీక్షకు 265 మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారులు ఇబ్రహీం, రఘుస్వామి శనివారం తెలిపారు. కొత్తపల్లి, గోకవరం పరీక్ష కేంద్రాలలో 325 మందికిగాను 170 మంది, గోకవరం 117 మందికి 95 మంది హాజరయ్యారని చెప్పారు. పరీక్ష కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్, బనగానపల్లె ఎంఈఓ-2 శ్రీనివాసులు తనిఖీ చేశారు.

48 మంది గైర్హాజరు

పాములపాడు: స్థానిక 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో 48 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినర్లు వెంకటేశ్వర్లు, రమణలు తెలిపారు. శనివారం జనరల్‌సైన్స్ పేపర్- 1 పరీక్ష జరిగింది. కాగా పరీక్షా కేంద్రాలైన ఏఎన్‌ఆర్ జెడ్పీహెచ్ స్కూలు 213 మందికి గాను 195 మంది, ఏపీ మోడల్‌స్కూలులో 253 మందికి 223 మంది హాజరయ్యారు.

102 మంది గైర్హాజరు

మహానంది: బండిఆత్మకూరు మండలంలో శనివారం జరిగిన పరీక్షలకు 102 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓలు మోహన్‌రెడ్డి, యశోద తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 496 మంది, ప్రైవేటు విద్యార్థులు 65 మంది హాజరైనట్లు వెల్లడించారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

మిడుతూరు: స్థానిక జిల్లా పరిషత ఉన్నత పాఠ శాల, ఆదర్శ పాఠశాల, కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం ఫ్లైయింగ్ స్క్వాడ్ మురళీ మోహన్ రెడ్డి తనిఖీ చేశారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో 232 మంది విద్యార్థులకు 44 మంది గైర్హాజరయ్యారని, కడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 181 మంది విద్యార్థులకు 25 మంది గైర్హాజరయ్యారని, మిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 186 మంది విద్యార్థులకు 25 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారులు మల్లికార్జున నాయక్, రవి ప్రకాష్ రావు, సాయి తిమ్మయ్య తెలిపారు.

అమరవీరుల ఆశయాలు కొనసాగిద్దాం



పాములపాడులో అమర వీరులకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: భరతమాత స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయాలు కొనసాగిద్దామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) జిల్లా నాయకుడు వై.ఆశీర్వాదం పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో యుక్త వయస్సులోనే వీర మరణం పొందిన భగత్‌సింగ్, సఖ్‌దేవ్, రాజ్‌గురుల 93వ వర్ధంతి శ్రీశైలంప్రాజెక్ట్‌లో శనివారం నిర్వహించారు. రింగ్‌పార్క్ సర్కిల్ వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వై.శ్రీను, పి.మల్లికార్జున, యాదగిరి, శివాని, ఎస్‌కే వలి తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భగత్ సింగ్, సుకుదేవ్, రాజ్‌గురుల చిత్రపటాలకు పార్టీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తుమ్మలూరు సర్పంచు వరప్రసాద్, కో ఆప్షన్ ముర్తుజావలి, ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు చౌడయ్య, అంబ య్య, బంగారం, మాజీ సర్పంచు బాలునాయక్, ఉశేన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సీపీఎం కార్యాలయంలో సీనియర్ నాయకుడు రామేశ్వరరావు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఇమ్రాన్, సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న, బాలయ్య, రమణ, షర్ఫుద్దీన్‌లు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని పాతబస్టాండ్, మండలంలోని నల్లకాల్వ, బాపనంతపురం, కొత్తరామాపురం, కురుకుంద గ్రామాల్లో భగత్‌సింగ్, రాజగురువు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సీపీఎం నాయకులు రాజశేఖర్, సుధాకర్, వీరన్న తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

క్రైం కార్నర్

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో అప్పుల బాధతో రైతు ఉరివేసుకుని మృతి చెందిన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు బొల్లవరం గ్రామానికి చెందిన కురువ గోపాల్ (57) గ్రామంలో పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. తనకున్న ఎకరం పొలంతో పాటు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేశాడు. పెట్టుబడి కోసం చేసిన రూ.7లక్షల అప్పు తీర్చే మార్గం కనిపించక మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూలేని సమయంలో కిటికీకి ఉరివేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కురువ తులశమ్మ(55) శనివారం ఉదయం గ్రామంలోని పాల కేంద్రం వద్దనున్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులకు విషయం తెలపడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బ్రాహ్మణకొట్కూరు పోలీసులు తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

జూపాడుబంగ్లా: బైక్‌పై నుంచి కిందపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ కోలుకోలేక శనివారం మృతిచెందినట్లు ఏఎస్‌ఐ మేరీజయంతి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. తూడిచెర్ల గ్రామం నుంచి ఏసన్న, అతని భార్య సుజాతతో కలిసి పక్షం రోజుల క్రితం ద్విచక్రవాహనంపై పెసరవాయి గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో సుజాత చీర కొంగు బైక్ చక్రానికి చుట్టుకోవడంతో ఆమె ప్రమాదవశాత్తు కిందపడి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

జూపాడుబంగ్లా: 80 బన్నూరు గ్రామానికి చెందిన చంద్రకళ(27)అనే మహిళ అదృశ్యమైనట్లు శనివారం ఆమె మామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ మేరీజయంతి తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు...80బన్నూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసి డ్రైవర్ సింగవరం రంగస్వామి కుమారుడు రాంబాబు 8మాసాల క్రితం మృతిచెందాడు. మృతుని భార్య చంద్రకళకు ముగ్గురు సంతానం. వీరికి జూపాడుబంగ్లా జగనన్నకాలనీలో స్థలం కేటాయించటంతో అక్కడ ఇళ్లు కట్టుకొని నివసిస్తున్నారు. భర్త మరణానంతరం ఈమె చిత్తుకాగితాలు ఏరుకొని వాటిని విక్రయించటం ద్వారా జీవనం సాగిస్తోంది. గురువారం పిల్లలను పాఠశాలకు పంపించి తాను చిత్తుకాగితాలు ఏరుకోవటానికి బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. కోడలు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో మామ రంగస్వామి తెలిసిన వారందరికీ ఫోన్లుచేసినా ఫలితం లేకపోవడంతో శనివారం జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

శ్రీశైలం: శ్రీశైలం దేవస్థానం పరిధిలోని టోల్ గేట్ వద్ద శనివారం సాయంత్రం సీఐ ప్రసాద్, వన్ టౌన్ పోలీసులతో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా శ్రీశైలంలోని పాతాళగంగం ప్రాంతానికి చెందిన మధు పల్సర్ బైక్‌పై మద్యం బాటిళ్లు తీసుకొస్తుండగా పట్టుకున్నారు. 15 మద్యం బాటిళ్లతో పాటు బైకును స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వెలుగోడు: వేల్పనూరు గ్రామానికి చెందిన కే. వెంకటరమణ 35 మద్యం బాటిళ్లు(180 ఎంఎల్) తరలిస్తుండగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

పది పరీక్షా కేంద్రాల తనిఖీ



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పద్మావతి హైస్కూల్ పరీక్ష కేంద్రాల్లో శనివారం జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు.

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

మహానంది: గాజులపల్లె చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో గాజులపల్లె మజరా గ్రామమైన బుచ్చమ్మతోట గ్రామంలో శనివారం రాత్రి కార్డెన్‌సెర్చ్‌లో భాగంగా ప్రతి ఇంటిలో సోదాలు నిర్వహించారు. అనంతరం నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని గాజులపల్లె చెక్‌పోస్టు వద్ద సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.